గట్టు తెగింది

రాత్రి తొమ్మిది గంటలు. అంత మహాపట్టణం అప్పుడే గాఢనిద్రలో మునిగినట్లు ఎటు చూసినా గాడాంధకారం. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. మనుష్య సంచారంలేదు. ఎటు చూసినా నిశ్శబ్దం. రోజూ ఎడతెగని జనప్రవాహం, కదలాడే రోడ్లు అన్నీ నిర్మానుష్యమయి వున్నాయి. అంత పెద్ద పట్టణమూ యే దేవత ఆగ్రహానికో గురయి, శాపగ్రస్తయి శిలగా మారిపోయినట్టు నిశ్చలంగా నిలబడ్డ రోడ్లు మాత్రం కనిపిస్తున్నాయి. మనుష్యులందరినీ మంత్రించి కదలకుండా చేసేసినట్లు అందరూ ఇళ్ళల్లో బిగుసుకుపోయారు. ఎవరో రాక్షసులు ఊరిమీద పడి దోచుకోడానికి వస్తే అంతా భయంతో ఇళ్ళల్లో దాక్కున్నట్లుండిపోయారు. ఆ రాక్షసుల అడుగుల చప్పుళ్ళలా గస్తీ తిరుగుతున్న సి.ఆర్.పి. బూట్ల టకటకలు ప్రజల గుండెలమీద సవారి చేస్తున్నట్లున్నాయి. ఆ రాక్షసులు బరువుగా ఊపిరి తీస్తున్నట్టు మధ్య మధ్య సి.ఆర్.పి. జీపులు, వ్యానులు రోడ్లమీద రొదచేసుకుంటూ పహారా కాస్తున్నాయి. ఇళ్ళ కిటికీలలోంచి కనపడే క్రొవ్వొత్తి హరికెన్ లాంతర్ల గుడ్డివెలుగూ లేకపోతే పట్టణం పూర్తిగా యే మారణాయుధానికో నేలమట్టమైపోయిందనుకునే ఆస్కారంవుంది.

ప్రజలంతా ఇళ్ళల్లో తలుపులు బిగించుకుని, ఉన్నదేదో తిని ఆ చీకటిలో చేసేదేంలేక నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ అదృష్టానికి నోచుకోని కొందరు ఇంటికి రాని భర్త గురించో, కొడుకుల గురించో ఆదుర్దాపడుతూ ఎక్కడున్నారో, యేమయ్యారో అనుకుంటూ ఇంట్లో వుండలేక, బయటికి వెళ్ళలేక తచ్చాడుతూ ఆదుర్దాపడుతున్నారు. పడుకున్న వాళ్ళకి నిద్రపట్టకుండా గుండెలమీద ధన్‌ధన్‌మని రిజర్వుపోలీసుల బూట్ల చప్పుడు అదరగొడ్తుంది.

ప్రజా జీవితం యెక్కడికక్కడ స్థంభించిపోయిన ఆ కాళరాత్రి... ఆ చీకటిలో పార్వతమ్మ అలా మంచంమీద మేకులా కూర్చుంది.

"ఎంత సేపలా కూర్చుంటావు పడుకో, పడుకో" అన్నారు సీతారామయ్యగారు మూడోసారి. ఆమె మాట్లాడలేదు. ఆమె కళ్ళు కిటికీలోంచి చీకటిని చీల్చుకుని అంధకారంలోకి చూస్తున్నాయి.

"పడుకో పార్వతీ, ఎంతకని అలా కూర్చుంటావు. ఈ కర్ఫ్యూ వుండగా వాడిప్పుడు ఇంటికి ఎలా రాగలడు."

"ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో, ఏమయ్యాడో ఎలా నిద్ర పోనండీ. తిండి తిన్నాడో లేదో, మధ్యాహ్నం రెండుగంటలకు ఇంట్లోంచి వెళ్ళాడు. ఏమయ్యాడో" ఆవిడ గొంతుపట్టుకుంది.

"ఎక్కడో ఏ స్నేహితుడింటిలోనో వుండిపోయి వుంటాడు" నీవిలా బెంగపడి ఇప్పుడు చెయ్యగలిగింది యేముంది? అయినా వాడికి బుద్ధిలేదు. కర్ఫ్యూ పెట్టారని తెలిసి, తిన్నగా ఇంటికి తగలడకుండా యేం చేస్తున్నాడు" కోపంగా అన్నారు సీతారామయ్యగారు. ఆయన మనసులోనూ కొడుకుపట్ల ఆదుర్దాగా వుండకుండా ఎలా వుంటుంది. ఆదుర్దాపడడం మినహా యేం చెయ్యలేని నిస్సహాయతతో ఆయనకి కోపం వస్తూంది.

"వద్దురా నాయనా యింటిలోంచి వెళ్ళకురా అంటే విన్నాడా? వద్దురా బాబూ, ఈ గొడవలలో తల దూర్చకురా అని నెత్తికొట్టుకు చెప్పాను. నా మాట లక్ష్యం వుండేనా. బజారులో సాయంత్రం కాల్పులు జరిపారు. ఇద్దరు కుర్రాళ్ళు చచ్చి పోయారట. పదిమందికి దెబ్బలు తగిలాయని చెప్పుకుంటున్నారు. వీడా గుంపులో ఉన్నాడో యేమిటో, ఆమాట విన్న దగ్గిరనించి నాకాళ్ళూ, చేతులు ఆడటంలేదు. ఏమయ్యాడో, ఎక్కడున్నాడో" ఆవిడింక మాట్లాడలేకపోయింది.

"ఏదొచ్చినా ముందీ స్టూడెంట్లకే. అన్నింటికీ మేమున్నాం అని తయారవుతారు. వాళ్ళకోసం మనం ఇలా బెంగలుపెట్టుకు చావడం. కానీ, మన అదృష్టం యెలా వుంటే అలా అవుతుంది. దేముడిమీద భారం వేయడం మినహా మనం యేం చెయ్యగలం. చెప్పగలమా, వాళ్లని ఆపగలమా?"

"ఏమిటండీ ఈ గొడవ. ఇంకెన్నాళ్ళండీ. ఎప్పటికి తగ్గుతుంది ఈ గొడవ. ఎన్నాళ్ళింకా యీ బాధలు. చదువుసంధ్యలు లేకుండా పిల్లలు తిరుగుతున్నారు. ఆఫీసులు లేవు, జీతాలు లేవు. అసలెందుకండీ ఈ అల్లర్లు" అధమం రోజూకోసారన్నా పార్వతమ్మ అమాయకంగా ప్రశ్న వేస్తుంది.

పాపం పాతకాలం పార్వతమ్మకి యీ 'ముల్కీ' గొడవేమిటో యెంత చెప్పినా అర్థం కాదు. ఈ అలజడి ఏమిటో, ఈ ఆవేశాలు, కక్షలు ఏమిటో బోధపడదు. ఈ బంద్‌లు, కర్ఫ్యూలు, పోలీసులు, కాల్పులు ఇదంతా ఎందుకో అర్థం కాదు. బంద్‌కి అర్థం ఏమిటో తెలియకపోయినా ఆ రోజు బజార్లో ఏమీ దొరకవని, కర్ఫ్యూ అంటే మనుష్యులు ఇళ్ళలోంచి బయటికి వెళ్ళకూడదని మాత్రం యిప్పుడిప్పుడు తెలుస్తోంది. ఆంధ్రులు, హైదరాబాదువాళ్ళు వేరవడానికి దెబ్బలాడుకుంటున్నారని, ఇంటిలో కొడుకు, తండ్రి మాట్లాడుకునే మాటలవల్ల ఇప్పుడిప్పుడు కొద్దిగా అర్థమవుతూంది. 'వేరవడం యెందుకండీ, హైదరాబాదువాళ్ళు తెలుగువాళ్ళే కదా!' అంటుంది. మహా మహా నాయకులే ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేక తలక్రిందులవుతూంటే ఆ తండ్రీ కొడుకులు యేమని జవాబివ్వగలరు. 'నీకర్థం కాదులే ఊరుకో' అని విసుక్కుంటారు తప్ప ఆవిడకి విడమర్చి చెప్పరు. కరెంటు లేక చీకటిలో తడుముకుంటూ వంటచేసుకోడానికి, పైపుల్లో నీళ్ళురాక బెందెడు నీళ్ళకి నానా అవస్థలు పడే వేళ, పాలురాక ఏ డబ్బాపాలతోనో కాఫీ త్రాగాల్సి వచ్చినప్పుడు, ఆ డబ్బాలకీ కరువొచ్చి బ్లాకులో కొండానికి మాయమయిపోయినపుడు, ఉత్తకాఫీ డికాషన్ తాగాల్సివచ్చినప్పుడు, ఇల్లు కదలడానికి వీలులేక, కూర నార కొనుక్కునే వీలులేక యే ఊరగాయతోనో అన్నం తినాల్సి వచ్చినప్పుడు, పనిమనుష్యులు రాక యింటెడు చాకిరీ చేసుకుంటున్నంతసేపు, కాలేజీలు, స్కూళ్ళు లేక పిల్లల గోల ఇంట్లో భరించలేక ఆవిడ – 'ఏం గొడవమ్మా దిక్కుమాలిన గోల. తిని కూర్చోక ఎందుకొచ్చిన దెబ్బలాటలంట. ఎప్పుడూ యేదో గోల. చదువు సంధ్యలు లేక పిల్లలు బలాదూరులా తిరుగుతున్నారు. ఈ రైళ్ళు కూడా ఆపుచేసేస్తున్నారు. ప్రయాణాలు చేయాల్సినవాళ్ళెలా చస్తారనుకున్నారో, అమ్మాయికి యేడునెలలు నిండిపోతాయి. ఈ గొడవ యిలా వుండగా రైళ్ళవీ సరిలేనప్పుడు అల్లుడు అమ్మాయిని పంపనంటాడు. ఈ గొడవ యెప్పటికి తగ్గేను. అదెప్పుడొస్తుందో – ఓపలేని పిల్ల యెలా చేసుకుంటుందో, నేనుండీ లేనిదాన్నయ్యాను. ఈ గొడవెపుడు తగ్గుతుందో, అదెప్పుడు వస్తుందో. విస్సుగాడి పెళ్ళి ముహూర్తం మాఘమాసంలో పెట్టుకున్నాం. ఈ గొడవ ఇలా ఉ ంటే యింకేం పెళ్ళి. కుదరక కుదరక కుదిరిందంటే ఆ ఆలశ్యానికి తోడు ఈ ఆలస్యం ఒకటి. ఏమిటో ఈ పాడుగోల' రోజల్లా ప్రతి సందర్భంలో ఆవిడ విసుక్కుంటూనే వుంటుంది గట్టిగానే.

"వూరుకో అమ్మా, నీకెంతసేపూ అక్కయ్య పురుడు, అన్నయ్య పెళ్ళిగోల, పాలు లేవో, కూరలు లేవో అనే గోలతప్ప... అవతల పరిస్థితి యెలావుందో, ప్రజలు

ఎలా గగ్గోలు యెత్తిపోతున్నారో నీకేం తెలుసు, మనుష్యుల ప్రాణాలకి గడ్డిపోచ విలువనీయకుండా కాల్చిపారేస్తూంటే... పాలో, కూరలో అంటావేమిటి? ఎన్ని త్యాగాలుచేస్తే స్వాతంత్ర్యం వచ్చింది, మరింకెన్ని త్యాగాలు చేసన్నా మనం ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకోవాలి. ఈ మాత్రం కష్టాలకి ఓర్చుకోలేకపోతే, ఈ మాత్రం త్యాగాలు చేయలేకపోతే మనం ఇంకేం సాధించగలం?" ఉడుకు రక్తంలో ఉన్న కొడుకు ఆవేశంతో, ఉద్రేకంతో తల్లి చాదస్తం మాటలకి విసుక్కుంటూ కేకలేస్తాడు. ఆమెలో లోపించిన దేశభక్తిని నిరశిస్తాడు.

కొడుకు బయటకు వెడుతున్నప్పుడల్లా 'వెళ్ళద్దురా నాయనా, నీ వెందుకు తలదూరుస్తావు ఇలాంటి వాటిల్లో. నా మాట వినరా' అంటూ ఆదుర్దాగా గోల పెడుతుంది. బ్రతిమాలో, కోపగించో కొడుకుని వీధిలోకి వెళ్ళకుండా చెయ్యాలని తాపత్రయ పడుతుంది. ఉడుకురక్తం పొంగులారే ఆ కొడుకుకి తల్లి ఆదుర్దా యెలా తెలుస్తుంది. ఆవిడ వంక కోపంగా, నిరసనగా చూస్తాడు.

"ఇదిగో అమ్మా. నీలాంటివాళ్ళుండబట్టే ఆంధ్రుల గతి ఇలా ఉంది. నీ కొడుకు ఇంటిలో కడుపులో చల్ల కదలకుండా కూర్చోవాలి, తక్కినవాళ్ళంతా పోరాడి సాధిస్తే అప్పుడు నీకొడుకు కాలేజీలో చదివి, ఉద్యోగాలు సంపాదించుకుంటాడు. అవునా? ఆంధ్రునికి ఐకమత్యంలేని వాళ్ళని ఊరికే అన్నారా, నీలాంటివాళ్ళుండబట్టే' దూకుడుగా అంటాడు. పార్వతమ్మ యేం మట్లాడలేక విసుక్కుంటుంది. "ఏమోరా నాయనా, అన్ని ఆవేశాలూ నీకే, ఆ సుబ్బమ్మగారి మనవడు చూడు, ఇల్లు వదల కుండా బుద్ధిగా యింటిలో కూర్చుని చదువుకుంటాడు."

"ఆ... ఆ... వాడో ఆదారి వెధవ. తప్పు, తప్పు అలా అని ఆడవాళ్ళని అవమానించకూడదు. ఆడవాళ్ళూ మాతో సమానంగా ఈ సమరంలో పాల్గొంటు న్నారు. నాతోటివాళ్ళందరికీ లేని ప్రాణభయం నాకేనా. నేనేనా యేం చెయ్యకుండా చేతులు ముడుచుకుని ఇంటిలో కూర్చుంటాను" ఆవేశంతో, ఉద్రేకంతో ఊగిపోతూ అంటాడు.

"అవును నాయనా, బజార్లంట గొంతులు చించుకుంటూ తిరగడం బస్సులు తగలెట్టడం, ఏది కనిపిస్తే అది విరక్కొట్టటం, రైళ్ళ రైనులు పీకడం, రాళ్ళు రువ్వడం ఇదట్రా దేశభక్తి అంటే. బస్సులు తగలెట్టు కుంటే, రైళ్ళు లేకపోతే, చదువులుపోతే యెవరికిరా నష్టం. ఎవరిని ఉద్ధరించడానికిరా ఈ గోలంతా."

"నీకేం తెలియదు ఊరుకో అమ్మా. ఇంత గొడవ జరిగితేనే కాని పట్టించుకుంటా

రనుకుంటున్నావా. ఎక్కడో ఢిల్లీలో కూర్చున్నవాళ్ళకి మా గోడు మామూలుగా వినిపిస్తుందనుకుంటున్నావా? ప్రతీదానికి యింత రాద్ధాంతం జరిగితే తప్ప నాయకులకి చురుకుపుట్టదు."

"బాగుంది నాయనా, అయినా నాకు తెలీక అడుగుతా, ఇలా యెప్పుడూ ఎవరో ఒకరు దేనికోదానికి గొడవచేస్తూ వుంటే పాపం ఆ 'ఇందిరమ్మ' మాత్రం ఏం చేస్తుంది. ఇప్పుడు ఇక్కడ యిలా ప్రత్యేక రాష్ట్రం ఇస్తే, మరెవరో చాలామంది గొడవచేస్తారని ఆలోచిస్తున్నారని మీ నాన్న అన్నారు. రేపొద్దున వాళ్ళందరికీ కూడ అడిగినవన్నీ ఇలా యిస్తూ ఎంతకని పోతారు. అయినా ఉన్నవాళ్ళు వుండకుండా ముందు వాళ్ళతో ఎందుకు కలవాలి. ఇప్పుడెందుకు వాళ్ళు, మనం ఈ కీచులాడుకోడం..."

'అదే అసలు జరిగిన పొరపాటు, అప్పుడు ఈ నాయకులంతా కలిసి అటూ ఇటూ ప్రజలకేం తెలియకుండా వాళ్ళిష్టం వచ్చిన నిర్ణయాలు చేసేసుకుని ఒప్పందాలు చేసుకున్నారట విశాలాంధ్ర కోసం. ప్రజల అభీష్టం, సమ్మతం అప్పుడు ఎవరికీ అక్కరలేకపోయింది. నిజం బైటికి వచ్చాక నిర్ణయాలు ఇటు అటు ప్రజానీకానికి అసంతుష్టి కారణమైంది. ఈనాడు దాని ఫలితం అనుభవించేది అమాయక ప్రజలు అయ్యారు. ఇంత దాకా వచ్చాక, ఇలా ఒకరిపట్ల ఒకరు ద్వేషంతో కొట్టుకునేకంటే విడిపోవడం మంచిది. ఇద్దరికీ రాజీ కుదరదని బోధపడ్డాక ఇంకా సమైక్యత కావాలని, ఆశించడం వ్యర్థం. అది యింక జరగదు. అన్నదమ్ములు ఆస్థులు పంచుకు విడిపోవడంలేదూ, అలాగే ఇదీనూ, అవనీ, ముక్కలవనీ దేశం ఈ అయిన ముక్కలకి యిదో ముక్కతోడు అవుతుంది. అంతేగాని దేశంలో యెక్కడా లేని యెవరికీ లేని రూలు ఆంధ్రుల కొక్కరికే నెత్తిన రుద్దితే ఆ అన్యాయాన్ని మేం ఇంకా సహించం. ఏమయినా సరే మా రక్తం ధారపోస్తాం. ప్రాణాలు త్యాగం చేస్తాం. ఈ అన్యాయాన్ని ఎదుర్కొని ప్రత్యేకరాష్ట్రం తెచ్చుకుంటాం. చివరి వరకు పోరాడుతాం. ఆంధ్రులంటే అసమర్థులు కాదని నిరూపిస్తాం. మేం పోరాడేది అన్యాయంతో, న్యాయం ఎప్పటికన్నా గెలుస్తుంది' పిడికిలి బిగించి ఉద్రేకంగా ఉపన్యసిస్తున్నట్లు అంటున్న కొడుకుని వింతగా చూస్తుంది ఆమె. ఆ ఆవేశం, ఉద్రేకం కొడుకులోనే కాదు, కొడుకు కోసం యింటికి వచ్చే కుర్రాళ్ళందరిలోనూ ఒకటే ఉత్సాహం, ఉద్రేకం. ఏదో ఏ ఆటో, సినిమా చూడ్డానికో వెళ్ళినంత ఉత్సాహంగా, చావంటే భయమన్నాలేకుండా అందరూ కట్టకట్టుకుని గుంపులు గుంపులుగా తోసుకుంటూ, నవ్వుకుంటూ పరిగెడ్తున్నారు. 'ఒరేయ్ యివాళ ఆల్ ఇండియా రేడియో' దగ్గిర పికెటింగ్ చెయ్యాలిరా అనో, ఫలానా పోస్ట్ ఆఫీసు తగల బెట్టాలనో, రైలు స్టేషను మీద దాడి చెయ్యాలంటూనో

చెప్పుకుంటూ చేతికందిన ఏ కర్రో పట్టుకుని పోలోమంటూ పరిగెడ్తున్న కుర్రాళ్ళని చూస్తూ వీళ్ళకింత భయం లేదేమిటి చెప్మా, ఇలా తయారయ్యారేమిటి అనుకుంటూ విస్తుపోతుంది. ఇదంతా దేశభక్తేనా అనుకుంటుంది. చదువుకుంటున్న కుర్రాళ్ళు సరే, అంట్లుతోమే అప్పి, పాలు పోసే నరసమ్మ, చాకలి అందరూ ఒకటే గోల. "సందు దొరికింది గదా అని ఎలా ఏదో వంకన ప్రతిరోజూ పని ఎగగొడితే ఎలాగే" అంటే 'ఏటమ్మగోరూ, ఊరంతా అట్టుడికి పోతంటే గిన్నెలంటారేటి, మాకు పాణంమీద తీపి నేదేంటి, రోడ్డుమీదికి వస్తే కాల్చి పారేస్తాండారు పోలీసోళ్ళు' అంటుంది. 'దొంగముండ, కర్ఫ్యూ వుండగాగాని, ఉత్తప్పుడు ఇది రోడ్డుమీద ఊరికే నడిచి వస్తూంటే కాల్చి పారేస్తారా ఎక్కడన్నా' విసుక్కుంటూ గొణుక్కుంటుంది ఆవిడ ఏం చెయ్యలేక. 'ఇవి పాలా నీళ్ళా' అంటే చాలు పాల మనిషి భారతం విప్పుతుంది. 'ఏమిటమ్మగారూ, ఇంకా ఇయన్నా పోస్తున్నా మీకు పాత ఓడిక గదా అని. ఊర్లో పాలచుక్క లేదు. సంటిపిల్లలకి కూడా పాలులేక ఏడుస్తున్నారు. మావోళ్ళందరూ శేరుకి శేరు నీళ్ళు కలిపి మూడు రూపాయలకమ్ముతున్నారు. నేనింకా మీ కాపాటి యిస్తున్నాను' అంటుంది ఉద్ధరిస్తున్నట్టు. దాన్నని ఏం లాభం. నిజం అంతే. పాలేమిటి, కూరలేమిటి, దినుసులేమిటి ఏదడిగితే దాని ధరలు రెండింతలు మూడింతలు పెరిగిపోయాయి. కొన్ని అసలు మార్కెటులో కనిపించడం లేదు. ఓపక్క దేశభక్తి, త్యాగం అంటూనే, అందినంతమేరా, అవకాశమున్నంత వరకు ఈ అవకాశంలో డబ్బు చేసుకోవాలనే మనుష్యుల స్వార్థం పార్వతమ్మకి ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఏదయితేనేం. ఎవరు పెడితేనేం, నిప్పంటించారు, అది అంటుకుంది దావానలంలా. నాలుగువైపులా రాజుకుంది. ఆ కారుచిచ్చుని ఇంక ఆర్పడం ఎవరితరం కాదని అందరికి అర్థమవసాగింది. సమైక్యత కుదరదని, రాజీ కుదరదని అర్థమవసాగింది నాయకులకీ. ఇటు అటు సంతృప్తికరంగా నిర్ణయాలు చేయడం అన్నది అసంభవమని వేర్పాటు తప్పదని అందరికీ బోధపడింది. అది జరిగే లోపల ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలో, ఇంకెంత ఆస్థి నష్టం జరగాలో, ప్రజలు ఇంకెన్ని రోజులు అవస్థపడాలో దేముడి కెరిక.

* * * * * *

మర్నాడు ఉదయం ఓ రెండు గంటలు కర్ఫ్యూ తొలగించారు, ప్రజల అవసరాల కోసం. వెంటనే నేల ఈనినట్లు, పుట్టలోంచి బయటకు వచ్చిన చీమల బారులా, ఎక్కడ పడితే అక్కడ మనుషులు. ఆరెండు గంటలలో తమ తమ పనులు పూర్తి

చేసుకోవాలన్న ఆరాటంలో పరిగెడ్తున్నారు మనుషులు. అప్పటికప్పుడు దుకాణాలు తెరిచేశారు. ఎటు చూసినా హడావిడి, గాభరా.

కర్ఫ్యూ తొలగించిన పది నిమిషాలకి హడావిడిగా యింటికివచ్చాడు ప్రసాద్. రాత్రంతా కలతబడిన మనసుతో నిద్రలేకుండా కొడుకుకోసం ఆరాటపడ్డ పార్వతమ్మ – కొడుకు కంటపడగానే అప్పటివరకు పడ్డ ఆరాటం మరిచి కోపంగా, ఎదురెళ్ళింది. 'ఏమిరా, కర్ఫ్యూ పెట్టగానే ఇంటికి రాకుండా ఎక్కడేడుస్తున్నావురా, రాత్రంతా నీకోసం ఏమయ్యావోనని ఏడుస్తూ కూర్చోవాలా. ఆ మాత్రం బుద్ధి ఉండక్కరలేదురా' కొడుకు మొహం చూసిన ఆవిడ వాగ్ధోరణి ఆగింది. 'అదేమిటిరా అలా వున్నావు. రాత్రి భోజనం చెయ్యలేదా ఏమిటి, అయ్యో అయ్యో, ఆ మొహం ఏమిటిరా అలా వుంది. అసలెక్కడున్నావురా రాత్రి, ఇంకా ఏ స్నేహితుడింట్లోనో ఉన్నావనుకున్నాం, ఏం జరిగిందిరా?' ఆవిడ ఆదుర్దాగా కొడుకు నుదురు ముట్టుకు చూసింది. ప్రసాద్ మొహం ఒక్క రాత్రిలో గుర్తుపట్టలేనంతగా మారింది. మొహం నల్లబడి ఎర్రటి వాచిన కళ్ళు, చెదిరిన క్రాపు, కళ్ళలో నీరసం కాక వ్యధ, నలిగిన మాసిన బట్టలు, కొడుకు అవతారం చూసి పార్వతమ్మ బెదిరింది. ప్రసాద్ 'అమ్మా' అంటూ చేతుల్లో మొహం కప్పుకుని కుర్చీలో కూలబడ్డాడు.

"ఏం జరిగిందిరా, అదేమిటిరా అలా వున్నావు?" ఆవిడ భయం మరింత ఎక్కువయింది.

"అమ్మా, శ్రీనివాస్ చచ్చిపోయాడమ్మా, చంపేసారమ్మా" అంటూ బావురుమన్నాడు.

"ఆ.." పార్వతమ్మ నిర్ఘాంతపోయింది. "ఎప్పుడురా... అదెప్పుడు రా... ఎలా చచ్చిపోయాడురా."

"నిన్న ఫైరింగులో గుండు తగిలింది. చచ్చిపోయాడు. సీనూ ఇంక లేడు" చిన్న పిల్లాడిలా ఏడుస్తూ అన్నాడు ప్రసాద్.

"అయ్యో!" పార్వతమ్మ అంతకంటే మాట్లాడలేకపోయింది. ఆవిడ గొంతులో దుఃఖం అడ్డుపడింది. ఆవిడకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. శ్రీనివాస్ – సీనూ, ఒకటో క్లాసునించి కాలేజివరకు కూడా కొడుకుతో కలిసి చదువుకుంటున్న అకుర్రాడికి – ప్రసాద్‌కి ప్రాణ స్నేహం అని ఆమెకి తెలుసు. ఒక కంచంలో తిని ఓ మంచంలో పడుకునే స్నేహం ఆ ఇద్దరిదీ. ఎన్నిసార్లో తన చేతుల్తో భోజనం పెట్టింది. "పెద్దమ్మా" అంటూ చనువుగా టలుస్తూ ఇంట్లో తిరిగే శ్రీనివాస్‌పట్ల ఆమెకి పుత్రవాత్సల్యం వుంది. కలిసి చదువుకుంటూ, కలిసి షికార్లు, సినిమాలు తిరుగుతూ ఇద్దరూ ఒకే

ప్రాణంలా తిరిగారు ఇన్నాళ్ళూ. శ్రీనివాస్ మరణం, అందులో దుర్మరణం కొడుకుమీద ఎంతలా దెబ్బతీసి వుంటుందో ఆవిడకి అర్థం అయింది. కళ్ళెదుట జరిగిన ఆ ఘాతుకానికి కొడుకు ఎంత చలించి ఉంటాడో ఆమెకి అర్థం అయింది. పాపం వాళ్ళ వాళ్ళకి ఒక్కడే కొడుకు. అయినింట్లో పుట్టాడు. అపురూపంగా పెరిగాడు. అఖరికి పట్టుమని ఇరవైయేళ్ళు నిండకుండానే దుర్మరణం. ఆ తల్లిదండ్రుల దుఃఖం తల్చుకుంటుంటే పార్వతమ్మ కడుపులో దేవినట్లయింది. అక్షణంలో కొడుకు క్షేమంగా వున్నాడన్న సంతోషాన్ని శ్రీనివాస్ మరణించాడన్న నిజం అధిగమించింది.

'ఎంత కష్టం వచ్చిందిరా పాపం వాళ్ళకి, ఏ రోగమో వచ్చిపోవడం వేరు. ఇలా ఉన్నపాటున చచ్చిపోతే వాళ్ళెలా భరిస్తున్నారో ఆ దుఃఖం. అందుకే వద్దురా నాయనా ఇల్లు వదిలి వెళ్ళకండర్రా అని మొత్తుకున్నాను. నా మాట విన్నారా. ఎంత ఘోరం జరిగింది. ఓసారి వెళ్ళి చూపివస్తానురా. మీ నాన్న బజారెళ్ళారు. తొరగావస్తే వెళ్ళి వద్దు. మళ్ళీ కర్ఫ్యూ పెట్టేస్తారు గాబోలు." ఏదేదో గాభరగా అంటూ హడావిడి పడింది పార్వతమ్మ.

ప్రసాద్ కళ్ళు తుడుచుకున్నాడు. "కొడుకు చచ్చిపోతే పాపం ఓదార్చడానికన్నా మనిషి లేకుండా వాళ్ళిద్దరే అలా ఒకరి నొకరు ఓదార్చుకుంటూ కూర్చున్నారమ్మా! కర్ఫ్యూ పెట్టగానే ఎక్కడి వాళ్ళక్కడ వుండి పోయారు. సీనూ ఆస్పత్రికి తిసికెళ్ళే త్రోవలోనే చచ్చిపోయాడు... తీసికెళ్ళి డాక్టర్లు సర్టిఫికెట్ ఇచ్చాక మేం ఇంటికి తీసికెళ్ళాం. ఈలోపలే కర్ఫ్యూ పెట్టేశారు. తక్కిన వాళ్ళంతా ఇళ్ళకి పరిగెత్తారు. నేను వుండిపోయాను."

"మంచిపని చేశావు. ఆ మాత్రం మనిషి సాయం వుండకపోతే మరింత బెంగపడి పోయేవారు."

"అబ్బా, నిన్న రాత్రంతా వాళ్ళ ఏడుపు చూడలేకపోయానమ్మా... నేనేం చెప్పగలను, ఏమని ఓదార్చగలను. చూడలేకపోయాను. వాళ్ళమ్మగారు మాటిమాటికి తెలివి తప్పిపోయేవారు. ఆయన, నేను అలా రాత్రంతా కూర్చున్నాం. శవాన్ని తీసికెళ్ళడాని కన్నా ఏం ఏర్పాట్లు చేయడానికి లేదు. ఇప్పుడింక వెళ్ళాలి. గబగబా ఏర్పాట్లు చేసి తీసికెళ్ళాలి. ఒక్కసారి ఇంటికి వచ్చి మీకు చెప్పి వెళ్ళాలని వచ్చాను. కాస్త కాఫీ ఇయ్యమ్మా, త్రాగి వెడతాను" అంటూ హడావిడి పడ్డాడు వెళ్ళడానికి.

"మళ్ళీ వెడతావురా, అయ్యో వద్దురా. మళ్ళీ కర్ఫ్యూ రెండు గంటలలో పెట్టేస్తు న్నారు. ఎక్కడో చిక్కడిపోతావు. వెళ్ళద్దురా నా మాట విను. మీరు తిన్నటివాళ్ళు

గాదు. ఏదో గొడవ చేస్తారు. పోలీసులు మళ్ళీ కాలుస్తారు. వెళ్ళద్దు నాయనా, నా మాట విను" కడుపుతీపితో ఆవిడ ఆదుర్దాగా గోలపెట్టింది.

"అమ్మా!" ప్రసాద్ తీక్షణంగా చూశాడు. "అవతల సీనూ చచ్చిపోయి... వాళ్ళ వాళ్ళు నిస్సహాయ స్థితిలో వంటరిగా వుంటే నన్ను వెళ్ళద్దంటున్నావా. ఇదే నీ కొడుకయి ... ఎవరూ నీ యింటిగుమ్మం తొక్కక పోతే నీకెలా వుంటుంది. ఈ సమయంలో ఇలా మాట్లాడుతావా. ఇవాళ సీనూ అయ్యాడు, రేపు నేనయితే" కఠినంగా అన్నాడు.

"ఊరుకోరా నాయనా, ఎందుకురా అలాంటి మాటలు. నా మాట వినవూ. ఆఖరికి ఆ సీనులా నీవూ ఎప్పుడో ఏదో చేసి నా కడుపులో చిచ్చు పెడతావు. నాకు తెలుసు. ఇదంతా ఇందుకే వచ్చింది. నాలాంటివాళ్ళని ఏడిపించడానికే ఈగొడవంతా వచ్చింది" ఆమె కంఠం రుద్ధమయింది. కొడుకు విసుగ్గా చూశాడు.

"ఊరుకో అమ్మా. ఎప్పుడూ ఇదే గోల నీకు. చస్తే యేం, ఓ మంచి పనికోసం దేశం కోసం ప్రాణం ఇచ్చే అదృష్టం కావాలన్నా అందరికీ రాదు. నాకేం చావంటే భయంలేదు. ఈ పోలీసులు, ఈ కర్ఫ్యూలు మమ్మల్నేం చెయ్యలేవు. మా ఆశియసిద్ధికోసం మేం అందరం ప్రాణాలీయడానికి సిద్ధంగా వున్నాం. ఇంత మాత్రానికే బెదిరి ఇంటిలో కూర్చునేటంత పిరికి పందలం కాం మేము. అందరినీ పిలుస్తాను, అందరం కలుస్తాం. సీనూ అంతిమయాత్రకి అందరం కలిసి పెద్ద ఎత్తున యేర్పాటుచేసి ఊరంతా ఊరేగించాలని, ఊరేగించి, ఇంకెందరు ఇలా ప్రాణాలర్పిస్తే తప్ప మన నాయకులకి చురుకు పుట్టదా అని ప్రశ్నిస్తాం" ఆవేశంగా అంటూ గుమ్మందాటుతున్న కొడుక్కి పార్వతమ్మ గాభరాగా అడ్డువెళ్ళింది. "వరేయ్, నా మాట వినరా. వెడితే వెళ్ళావుగానీ మళ్ళీ కర్ఫ్యూ పెట్టేలోగా తిరిగిరా నాయనా. అనవసరంగా మొండితనం చేసి ప్రాణాలతో చెలగాటాలు ఆడకండిరా" ఆవిడ మాటలు గాలిలో కలిసిపోయాయి. ప్రసాద్ పరుగులాంటి నడకతో సందు తిరిగిపోయాడు.

ఎడా పెడా సంచులతో కూరలు, దినుసులు మోసుకొచ్చిన సీతారామయ్యగారు ఇంట్లోంచి కేకలు పెడ్తున్న భార్యని చూసి కాస్త ఆశ్చర్యంగా 'వీడు మళ్ళీ ఎక్కడికి పోతున్నాడు?' అని అడిగాడు. అంత వరకు ఆరాటాన్ని, ఆవేదనని ఒంటరిగా అనుభవిస్తున్న పార్వతమ్మ భర్త కనపడగానే, అడగ్గానే ఆవేశంగా అంతా చెప్పుకొచ్చి 'వెళ్ళండి, వాడ్ని పిలుచుకునిరండి. మీరు కేకలేస్తే వస్తాడు, త్వరగా వెళ్ళి తీసుకురండి!

లేకపోతే ఈ ఆవేశంలో యేం అఘాయిత్యం చేస్తాడో. నిన్న సీనయ్యాడు. ఇవాళింకేం జరుగుతుందో" ఆవిడ గోలపెడుతూ తొందర చేసింది. అంతావిని నిట్టూర్చారు సీతారామయ్యగారు. "లాభం లేదు పార్వతీ, వాడ్ని ఆపడం మనవశంలో లేదు. బజార్లో చాలా గొడవగా వుంది. నిన్న చచ్చిపోయిన, దెబ్బలు తగిలినవారి గురించి ఈ కుర్రాళ్ళందరూ చాలా గొడవ ఆరంభించారు. మళ్ళీ యేదో గొడవ జరుగుతూంది. లాఠీచార్జి జరుగుతుంది. మళ్ళీ వెంటనే కర్ఫ్యూ పెట్టేస్తారనుకుంటున్నారు. అందుకే గబగబా వచ్చేశాను. కుర్రాళ్ళందరూ ఆవేశంతో శివం యెక్కిపోయి రాళ్ళు రువ్వుతున్నారు."

"అయ్యయ్యో, ఎలాగండీ, వీడు గుంపుని చేరేసి కుర్రాళ్ళందరూ కలిసి సీనూని ఊరేగింపుతో తీసికెడతారట. పోలీసుల మాట వినరు గాబోలు. మళ్ళీ కాల్పులు జరుగుతాయో ఏమిటో... అలా చూస్తారేమిటండీ. నయానో భయానో వాడ్ని ఇంటికి లాక్కురండీ."

"వాడు రాడు పార్వతీ, ఇప్పుడు వాళ్ళెవరిమాటా వినే స్థితిలో లేరు. వాడు వస్తానన్నా తక్కినవాళ్ళు రానిస్తారా. డి.ఎస్.పి.ని ఘోరావో చేశారు. ఏదో చాలా గొడవగా వుంది. మళ్ళీ షాపులు అవి మూసేస్తున్నారు. అందుకే యేవో దొరికినవి నాలుగు కొని వచ్చేశాను.

"మరెలాగండీ, మనం చూస్తూ ఊరుకోవలసిందేనా?" ఆవిడ ఆరాటంగా అంది.

"అంతే. దేముడిమీద భారంవేసి ఊరుకోవాలి. మన అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుందనుకోవాలి. ప్రశాంతంగా పారే నదిని వరద వెల్లువ వచ్చి కొట్టేసింది. గట్టు తెగింది. ఆ ప్రవాహాన్నింక అడ్డగలగడం ఎవరితరం. ఆ గండి పూడ్చగలగడం యెవరి శక్యం. గండి పూడిస్తేగాని వెల్లువ ఆగదు. వరద ఆగితేగాని గండి పూడ్చడం జరగదు. ప్రస్తుత పరిస్థితి ఇది. ఇంకా వెల్లువలో యెందరి ప్రాణాలు కోల్పోవాలో, ఇంకెంత నష్టం జరగాలో, ఇదంతా ఎందుకొచ్చిందో, ఏం జరుగుతుందో" ఆయనలో ఆయన గొణుక్కుంటూ సీతారామయ్యగారు సంచులతో లోపలికి నడిచారు.

పార్వతమ్మ అయోమయంగా గుమ్మంలో నిలబడిపోయింది యెటో చూస్తూ. బహుశా ఆవిడ ఆ కనపడని దేముడిని కొడుకు క్షేమం కోసం ప్రార్థిస్తోందేమో.

(ఆంధ్రసచిత్ర వారపత్రిక, 1972 ప్రాంతం)